సాక్షి

# ప్రయాణికుల భద్రతే ప్రధానం

## రైళ్ల నిర్వహణపై మెట్రో ఎండీ సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: రైళ్ల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ట్రాక్‌ల పటిష్టత, విద్యుత్ సరఫరా, రైళ్ల రాకపోకల నిర్వహణ వంటి అన్ని అంశాల్లో 24 గంటల పర్యవేక్షణ కొనసాగాలని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో వివిధ విభాగాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే సత్వరమే తగిన చర్యలు చేపట్టేవిధంగా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. వయాడక్ట్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వరదనీరు నిల్వ లేకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాయింట్‌లు, నట్లు,బోల్టులు వంటి వాటి పటిష్టత ఎంతో ముఖ్యమని చెప్పారు. మెట్రో ట్రాక్ మార్గాల్లో ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను తొలగించాలి. మరోవైపు వర్షాకాలంలో ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.